# విలోమం

ఈ ఆదివారమే కాదు, ఏ ఆదివారమూ నాకు సెలవు దినంగా అనిపించదు. ఆఫీసు పని తప్పినా, వంటపని తప్పదు కదా ...

"రాధా! టీ త్వరగా, మా వాళ్ళు వెళ్ళిపోవాలని ఆత్రపడుతున్నారు" అంటూ నన్నుద్దేశించి జీవన్ బయటి గదిలోంచి కేక!

"ఆ వస్తున్నా!" అంటూ బదులు కేక వేశాను.

అయిదు నిమిషాల్లో అందరికీ టీలు అందించాను. జీవన్ అక్కడ కూచుని వున్న నలుగుర్నీ ఓసారి పరకాయించి చూసి - నల్లగా, సన్నగా వున్నాయన్నుద్దేశించి 'చూడు మిస్టర్ జయరాజ్ - మా మిసెస్ రాధ' ఇర్రిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో టైపిస్టు' అనేసి నవ్వుతూ నా వైపు చూస్తూ 'హి ఈజ్ జయరాజ్ - మా కొలీగ్ - కొత్తగా మొన్ననే మా ఆఫీసుకు ట్రాన్స్‌ఫరయి వచ్చాడు" పరిచయం చేశాడు. ఇద్దరం పరస్పరం నమస్కారాలు చేసుకున్నాం. జీవన్ పక్కనే వున్న కుర్చీలో కూచున్నాను.

"మిస్టర్ జయరాజ్! మీకు తెలీదనుకుంటా మాది ఇంటర్‌కేస్ట్ మారేజి. వర్ణాంతర వివాహం! నా కులం మీకు తెలుసు కదా... ఇంక ఈమె కులం మాల, మీ కులమే ఎస్సీ... ఈ రకంగా మీకూ, నాకూ పరోక్ష బంధుత్వం వుందన్న మాట!" అంటూ నవ్వుతున్నాడు జీవన్. జయరాజు ఇబ్బందిగాను, తక్కిన ముగ్గురూ అమితానందంగానూ నవ్వుతున్నారు.

అక్కడ ఎందుకు కూచున్నానా అని సిగ్గుపడుతున్నాను నేను. ఇప్పుడు ఇక్కణ్ణుంచి వెళ్ళిపోవడమెట్లా? జీవన్ ఎప్పుడూ ఇంతే - సమయం సందర్భం వుండదు. సందు దొరికితే చాలు, తను వర్ణాంతర వివాహం చేసుకున్నట్టు చెప్పుకుపోవడమే.

"జయరాజు అంత లక్కీ ఫెలో ఎవరూ వుండరు రాధా! మూడేండ్ల కిందట జూనియర్ అసిస్టెంట్‌గా మా డిపార్ట్‌మెంట్‌లో చేరాడా! అప్పుడే సీనియర్ అసిస్టెంట్ అయ్యాడు. రేపో ఎల్లుండో డిప్యూటీ తహసిల్దారవుతాడు" అంటూ జీవన్ చెబుతోంటే జయరాజు తల వంచుకుని టీ తాగుతూ వున్నాడు.

జీవన్ అక్కడితో చెప్పడం ఆపలేదు. "ఇట్లా ఎస్సీలకి గవర్నమెంట్ మంచి చేయూత నిస్తూ వుండటం మనమంతా నిజంగా గర్వించతగ్గ విషయం.. ఏమంటారు శేషయ్యా!" అంటూ సోడా బుడ్డీ అద్దాల మనిషిని అడిగాడు జీవన్. 'నిజం మీరు చెప్పింది' అన్న అర్థం వచ్చేలా తల ఆడిస్తూ నవ్వాడు శేషయ్య.

"అసలు అంబేద్కర్ మన దేశంలో పుట్టడం ఈ దళితులకి గొప్ప మలుపు తెలుసా! రిజర్వేషన్లు అణగారిన కులాలకి వుండాలని ఆయన రాజ్యాంగంలో పొందుపరచడం దళితుల అదృష్టమే. మనం ఈ విషయంలో ఆనందించాలి" అన్నాడు శ్రీనివాసరావు.

'అవును మరి, తరతరాలుగా అణగారిన వాళ్ళకి ఎక్కడి నించి వస్తాయండీ అద్భుతమైన తెలివితేటలు! వాళ్ళ జీన్స్‌లో తక్కువతనం, తక్కువ భావన గూడుకట్టుకుని వుంటాయి కదా!' అన్నాడు మోహన్.

వీళ్ళల్లో ఒక్క జయరాజు తప్ప తక్కిన ముగ్గురూ ఏదో ఒక సెలవు దినాన ఇక్కడే జీవన్‌తో చదరంగమో, పేకో ఆడుతుంటారు. అందువల్ల వాళ్ళ మాటల్ని నమ్మలేక పోతున్నాను.

వంటింట్లో పాత్రలు దొర్లుతున్న శబ్దాలు ... ఉరుకులు పరుగుల మీద వంటింట్లోకి వెళ్లాను. 'రోహిత్' గాడు నీళ్ళ గ్లాసుతో కనిపించాడు. 'ఏరా!' అన్నాను. 'ఏం జరిగింది?' అనబోయి... 'నీళ్ళమ్మా!' గ్లాసు కోసం చూస్తూ. వాడికి ఆరేళ్ళు నిండుతున్నా మొహంలో రెండు మూడేళ్ళ పిల్లల్లో వున్న అమాయకత్వమే కనిపిస్తుంది నాకెప్పుడూ. వాడిని ఇంగ్లీషు కాన్వెయిలో వేసి ఎల్‌కేజీ, యూకేజీలు చదివించాలని జీవన్ చాలా ప్రయత్నించాడు. ప్రాథమిక విద్య మాతృభాషలోనే వుండాలనీ, ఆరేళ్ళ వరకూ స్కూలుకు పంపకూడదనీ తెలుగు బళ్ళోనే చదివించాలని నేను జీవన్‌తో పెద్ద పోరాటమే చెయ్యాల్సి వచ్చింది. ఆ పోరాట ఫలితమే వాడు నెల క్రిందట తెలుగు బళ్ళో చేరడం. ఈ మధ్యనే జీవనే చేర్పించి వచ్చాడు. రోహిత్‌గాడు నీళ్ళు తాగేసి ఆడుకోడానికి వెళ్ళిపోయాడు.

బయట గదిలో జీవనూ, అతని కొలీగ్సూ దళితుల మీద చర్చలు సాగిస్తూ వున్నారు. వాళ్ళలో జయరాజు లేకుంటే ఆ చర్చాగోష్ఠి ఎంత తలకిందులుగా వుండేదో నాకు తెలుసు.

నాకు ఒక్కోసారి మనుషుల మీద నమ్మకం సడలడానికి ఒకే ఒక్క కారణం జీవన్! జీవన్, నేనూ జీవిత భాగస్వాములు కాకముందు ఇద్దరం ఒకే తరగతి వాళ్ళం - బి.ఎ.లో. అప్పట్లో అభ్యుదయ భావాలున్న విద్యార్థుల్లో జీవన్ మొదటివాడు. విద్యార్థి యూనియన్ లీడరుగా వుండేవాడు. కాలేజీ ఫంక్షన్స్‌లో ఎప్పుడూ నేను పాటలు పాడేదాన్ని. నా పాటలంటే జీవన్‌కి పిచ్చి! మా ఇంటికొచ్చి నా పాటల్ని టేపు చేసుకుని వెళ్ళేవాడు. మా అమ్మానాన్నలకు కూడా జీవన్ అంటే గౌరవమే. "మీ పాటల్లో లత గొంతులోని సౌకుమార్యత, సుశీల గొంతులోని తియ్యదనం ఉంద"ని మెచ్చుకొనేవాడు జీవన్. ఆ మాటలు వింటున్నప్పుడు ఎంత పొంగి పోయేదాన్నో చెప్పలేను.

అట్లా మా ఇద్దరికీ ఒకరిపై ఒకరికి అభిమానం పుట్టుకొచ్చింది. కట్నాలని తీసుకునే యువకుల్ని సంతలోని జంతువులంటూ విమర్శించేవాడు జీవన్. 'అంటరానితనం' జాతికి మచ్చ, దాన్ని అసహ్యమైన

పదంగా చెప్పుకోవాలి అని ఆవేశంగా అనేవాడు ఎప్పుడూ. అప్పటికే నేను దళితురాలినని జీవన్‌కి తెలుసు. బి.ఎ. కొత్తగా చేరిన రోజుల్లో సరదాగా 'క్లరికల్ కేడర్ గ్రూప్ ఫోర్' పరీక్షలు రాసి వుండడంతో 'ఎస్సీ' రిజర్వేషను కోటా కింద నాకు ఇర్రిగేషన్ డిపార్టుమెంటులో టైపిస్టుగా ఉద్యోగం వచ్చింది. దాంతో బి.ఎ. పూర్తి చేయకుండానే ఉద్యోగంలో చేరిపోయాను. తొలిసారిగా నా జీవితంలో తొలి మలుపు అది. జీవన్ ఒకటే పొంగిపోయాడు ఆ రోజు. ఆ తరువాత ఒక వారానికి అనుకుంటా ఒక సాయంత్రం ఆఫీసు వదిలే సమయానికి బయటే కాచుకుని వున్నాడు జీవన్.

"ఆఫీసు వాళ్ళేమయినా అనుకోరూ నువ్విట్లా..." అన్నాను తగ్గు స్వరంతో..

మారు మాట్లాడకుండా దగ్గర్లోనే వున్న హోటల్లోకి తీసుకుపోయాడు. ఒక మూలలో వున్న టేబుల్ ముందు కూచున్నాం. సర్వరు తెచ్చిన కాఫీ తాగుతున్నాం. వున్నట్టుండి అన్నాడు జీవన్ "నేన్నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను" అని. ఆ మాటతో కొన్ని క్షణాలు అవాక్కయి పోయాను. ప్రేమ ప్రస్తావన లేకనే పెళ్ళి ప్రస్తావన! నేను వింటున్నది కలో, నిజమో తేల్చుకోలేని స్థితి!

"అమ్మా, నాన్న అంగీకరిస్తే... అందులోనూ మీది పెద్ద కులం కదా!" అన్నాను. మనుషుల మధ్య కనిపించని పెద్ద కోటగోడ కులం అనిపించిందా క్షణంలో... మా నాన్న అన్నీ విన్నాక ఒకే ఒక్క మాట అన్నాడు "బాగా ఆలోచించగలదానివి - నీ నిర్ణయం కాదనను... జీవన్ నిన్ను పెళ్ళి చేసుకోవడంలో తన ఆర్థిక స్థితి దృష్టిలో వుంచుకున్నాడేమో.. నీకీ ఉద్యోగం రాకుంటే నిన్ను పెళ్ళి చేసుకునేవాడా? ఆలోచించుకో" అన్నాడు. ఎంత హేతువాది అయినా ముసలితనపు చాదస్తంతో అలా మాట్లాడారేమో మరి అనుకున్నాను. నెల తరువాత మాకు పెళ్ళయిపోయింది. పెళ్ళయ్యాక బి.ఎ. పరీక్షలు పూర్తి చేసి, సెకండ్ క్లాస్‌లో పాసయ్యాడు జీవన్. మా నాన్న రికమెండేషన్‌తో ఒక ప్రైవేట్ కాన్వెంటు స్కూల్లో టీచర్‌గా ఉద్యోగం దొరికింది. అలా ఒకటిన్నర సంవత్సరం హాయిగానే గడిచింది. ఈ లోగా 'రోహిత్' పుట్టాడు. అప్పుడప్పుడు తనకు గవర్నమెంటు ఉద్యోగం రానందుకు బాధపడేవాడు. ఎప్పుడయినా 'ఈ రిజర్వేషను వల్లనే తనకు ఉద్యోగం రాకుండా వుందని' వ్యధకు గురయ్యేవాడు. అదృష్టం కొద్దీ ఆర్నెల్లకల్లా జీవన్‌కి రెవిన్యూ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది. జీవన్‌లో నూతనోత్సాహం చోటు చేసుకుంది.

జీవన్‌లో 'దళిత ద్వేషం' నిప్పురవ్వ ఎప్పుడు పడిందో తెలీదు కానీ 'చుండూరు'లో హరిజనుల ఊచకోత సంఘటన జరిగినప్పుడు గానీ, అది బాగా రగులుకొని బయటపడలేదు. "వీళ్ళేం తక్కువ నా కొడుకులు కాదులే రాధా! ఆ భూస్వాముల ఆడవాళ్ళని అల్లరిపెట్టి వుంటారు.. తక్కువ కులం నాయాండ్లు అట్ల నిక్కి నీలుగుతుంటే - సంఘాలు పెట్టుకోని మిడిసి పడుతుంటే నరికెయ్యకుండా వుంటారా?" అన్నాడో రోజు ఉదయమే పేపరులోని వార్త చదివి.

ఆ మాటతో "ఇదేమిటి జీవన్! నువ్వేనా ఇట్లా మాట్లాడేది?" అన్నాను ఏమనాలో తెలీక.

"రాధా! నువ్వు ఆ కులం దానికి కాబట్టి కులాభిమానం పోగొట్టుకోలేక అట్లా ఆశ్చర్యపోతున్నావు. మంచిగా వున్నంత కాలం మా వాళ్ళు మనుషులుగా చూస్తారు మించి పోయినారంటే అంతే".

కళుక్కుమంది నాకు.. ఇంత ద్వేషముందా ఈ మనిషిలో అనిపించి ఏడ్చేశాను. ఒక వారం పాటు

మా మధ్య మాటలు కరువైనాయి. ఆ తరువాత అప్పుడెప్పుడో మండల కమిషన్ సిఫార్సుకి వ్యతిరేకంగా తలెత్తిన ఉద్యమానికి బలంగా సపోర్టు చేస్తూ రెండోసారి బయటపడ్డాడు. గవర్నమెంట్ 'ఓట్ల వేట' నాటకంలోని అంతర్భాగమే రిజర్వేషన్‌లనీ, అంటరాని వాళ్ళకి నిజంగా అది కన్నీటి తుడుపేనని నేను ఎంత మొత్తుకున్నా జీవన్ చెవుల కెక్కనేలేదు.

❀❀❀

ఆ మరుసటి రోజు సాయంత్రం ఆఫీసు నించీ ఇంటికొస్తూనే మెట్లపైనే కూచుని వున్నాడు రోహిత్. మా ఇద్దర్లో ఎవరో ఒకరు ఆఫీసు నుంచీ వచ్చేవరకూ రోహిత్‌ని పక్క ఇంట్లో వుండేలా ఏర్పాటు చేశాను. అయినా ఒక్కోసారి ఎందుకో మెట్ల మీదనే కూచుండిపోతాడు వాడు. ఏరా! ఎంతసేపయింది వచ్చి! అన్నాను. 'చాలా సేపయ్యింది' అన్నాడు వాడు. తాళం తీస్తుంటే నా కొంగు పట్టుకునే వున్నాడు వాడు.

"అమ్మా! మా బళ్ళో నాకు పుస్తకాలు, కొత్త బట్టలూ ఇచ్చినారు ఇవిగో" అంటూ ఇంట్లోకి వెళ్తూనే బ్యాగ్ తీసి చూపించాడు. ముతకగా వున్న ఆకుపచ్చటి నూలు చొక్కా, ఖాకీ నిక్కరూ.. పదేళ్ళ పిల్లాడికి సరిపోయే డ్రస్సు అది. తెలుగు బళ్ళో చేర్పిస్తే పుస్తకాలూ, బట్టలూ ఇస్తారన్న మాట! అయినా నా మనసు ఎందుకో ఏదోలా అనిపిస్తోంది. లేని వాళ్ళనుద్దేశించి గవర్నమెంట్ ఇస్తోందేమో. అంతో ఇంతో కొనగలిగిన స్తోమత వున్న వాళ్ళం, మనం తీసుకోవచ్చా? ఇద్దరం ప్రభుత్వోద్యోగులమై వుండీ, ఇట్లా ప్రభుత్వం సొమ్ముని వృధా చేయడం మంచిది కాదనిపించింది.

రాత్రి భోజనాలయినాక రోహిత్‌గాడికి బళ్ళో ఫ్రీగా బట్టలూ, పుస్తకాలూ ఇచ్చిన విషయం చెప్పాను జీవన్‌తో.

"సర్లేవే - ఇస్తే ఇచ్చినారులే.. నీ కొడుక్కి ఒక్కడికీ ఇచ్చినందువల్ల గవర్నమెంట్ దివాళా తీయదులే- నీకు ఇష్టం లేకుంటే ఏ అడుక్కునే వాడికో ఇచ్చెయ్యి" అన్నాడు సిగరెట్టు తాగుతూ.

నా మనసు కుదుట పడలేదు. అందుకే ఉదయం గంట లేటు పర్మిషన్ లెటర్ జీవన్‌తో పంపించి స్కూలుకు వెళ్ళాను.

నేరుగా హెడ్మిస్ట్రెస్ దగ్గరికిపోయి విషయమంతా వివరించాను. "ఈ బట్టలూ, పుస్తకాలూ లేని పిల్లవాడికి ఇవ్వండి, పొరపాట్న మా వాడికి ఇచ్చారు" అన్నాను.

"మేము పొరపాటు పడలేదమ్మా - మీ పిల్లవాడు 'ఎస్సీ' కాబట్టి వాడి కోటాకు వచ్చిన పుస్తకాలు, బట్టలూ ఇచ్చాము" అంది హెడ్మిస్ట్రెస్.

"వాడు 'ఎస్సీ' అని ఎవరు చెప్పారు?"

"వాళ్ళ నాన్నే రాయించారు అప్లికేషన్‌లో 'ఎస్సీ' అని" అందామె.

నా తల దిమ్మెక్కిపోయింది.

- 26-5-95, ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక